# 'డబ్బు'

"డబ్బు! డబ్బు!! డబ్బు!!! ఉదయం లేచీ లేవడంతోనే పారాయణం ప్రారంభమవుతుంది. రాత్రి పదిగంటలవరకూ ఎడతెరిపిలేకుండా కొనసాగుతుంది. 'ఇంట్లో బొగ్గులు లేవు, చక్కెర లేదు, కాఫీపొడి లేదు, కూరగాయలకి డబ్బులు కావాలి. పనిమనిషి డబ్బు అడుగుతున్నది. ఈపూటకిబొగ్గులు ఎల్లాగో సరిపెట్టుకోవచ్చు. కాని చక్కెర, కాఫీపొడి లేకపోతే గడవదు. పనిమనిషిని ఫస్టుదాకా ఆగమని చెప్పవచ్చు. కాని కూరగాయలు మాత్రం వెంటనే బజారుకి వెళ్ళి తేవాలి' — ఇదీ వరస—ఇదీ ధోరణి. డబ్బు! డబ్బు!! డబ్బు!!! ఊఁ అంటే డబ్బు. ఆఁ అంటే డబ్బు. నెలాఖరికి ఎక్కడని పుడుతుంది? ఎంతని పుడుతుంది? ఈమధ్య ఎక్కడా అప్పుకూడా పుట్టడం లేదు. బొగ్గులు లేకపోతే ఈపూట వంట మానెయ్యమను మీ అమ్మని. చక్కెర, కాఫీపొడి లేకపోతే కాఫీ కాచడం మానుకొమ్మను. కూరగాయలు లేకపోతే ముడికూడు వండి నా మొహాన ఇంత తగలెయ్యమను. అంతేకాని, చీటికి మాటికీ డబ్బుకోసం నన్ను వేధించవద్దను"

రెండుగదుల సంసారంలో, ఒక గదినించి ఇంకొకగదికి డబ్బుకి సంబంధించిన రాయబారాలు నడుపుతున్న అయిదు ఏళ్ళ బాబుకి, తండ్రికోపం చూచి భయంవేసింది. నెమ్మదిగా వెనక్కి నడుస్తూ పక్కగదిలోకి తప్పుకున్నాడు. ఎందుకో తల్లి ఏడుస్తూ, కొంగుతో కళ్ళు ఒత్తుకుంటున్నది. తన తండ్రి,

తన తల్లిని ఏమీ అనలేదే? మరి ఎందుకు ఆమె ఏడ్వడం? ఎందుకో బాబుకి అర్థంకాలేదు. పిచ్చి కోపంతో తన తండ్రి ఏవేవో మాట లన్నాడు. కొన్ని మాటలు తనకి అర్థంకాలేదు. కాని ప్రత్యేకంగా తన తల్లిని ఉద్దేశించి ఆమాట లన్నట్లు తోచలేదు బాబుకి. డబ్బు యివ్వమంటే తండ్రి యివ్వలేదు. బజారుకి వెళ్ళి కూరగాయలు తెమ్మంటే తీసుకురాలేదు. అంతే—తన చేతికి డబ్బిచ్చి కూరగాయలు తీసుకురమ్మనాన్నా, తను బజారుకి వెళ్ళి తీసుకువచ్చేవాడే. తనకి మాటలు వచ్చు, తను కూరగాయల అమ్మితో బేరమాడగలడు. కాని తన తండ్రి ఎందుకో, తానూ బజారుకి వెళ్ళలేదు, తనకి డబ్బు యివ్వలేదు. కాని ఇంతకీ తన తండ్రిదగ్గర డబ్బు లేదేమో? నిజమే, డబ్బు లేక నేకదూ ఈ పోట్లాట లన్నీ?

పక్కింటి సుబ్బారావుగారి దగ్గర ఎంతో డబ్బు ఉంటుంది. అతను పుస్తకాలలో డబ్బు దాచటం తను కళ్ళారా చూచాడు. డబ్బు లేకపోతే, అతను పుస్తకాల్లో ఎందుకు దాచి పెడతాడు. అతని దగ్గర తప్పక బోలెడు డబ్బు ఉండి ఉంటుంది. నాన్న దగ్గర డబ్బు లేకపోవడంవల్లనే, ఎక్కడా డబ్బు దాచి పెట్టడం లేదేమో? నాన్న జీతం తేవడంతోనే, పెట్టెలో జాగ్రత్తగా దాచి పెడతాడు. అప్పుడు అమ్మ మొహం, సంతోషంతో కళకళలాడు తుంటుంది. రెండు మూడు రోజుల వరకూ ఏ తగాదాలూ ఉండవు. ఏ పోట్లాటలు ఉండవు. అప్పట్లో తాము సినిమాకి వెళ్ళడం కూడా కద్దు.

జీతం వచ్చిన కొన్ని రోజులకి తిరిగి తగాదాలు మొదలవుతాయి. బహుశా అప్పటికి డబ్బు అయిపోతుందేమో?

నాన్న అంత తొందరగా డబ్బు ఎల్లా ఖర్చు పెడతాడో తెలియదు. జీతం రావడంతోనే తను తీసుకొని, డబ్బు పొదుపుగా వాడితే ఎల్లా ఉంటుందో? కాని నాన్న తన చేతికి డబ్బు ఇస్తాడా? ఏమో? అయినా ఈమాటు అడిగి తీసుకోవాలి. తను అడిగితే ఇవ్వకుండా ఎల్లా తప్పించుకుంటాడు? జీతం వచ్చినప్పుడు గదా ఆ సంగతి ఆలోచించడం? ఇంతకీ జీతం ఎప్పుడు వస్తుందో? ఈ రోజువస్తే బాగుండేది. నాన్న సంతోషించేవాడు; అమ్మకూడా సంతోషించేది.

డబ్బు లేనప్పుడు జీతం ఇవ్వమని నాన్న ఆఫీసులో ఎందు కడగడో? అప్పు తేవడం మొహమాటంగా ఉంటుం దంటాడు నాన్న. ఆ మొహమాట మంటె ఏమిటో తనకు తెలియదు. అమ్మని అడిగి తెలుసు కోవాలి. ఈ రోజు అమ్మ సంతోషంగా లేదు. ఇప్పుడు కాదు తను అడిగి తెలుసు కోవడం. సంతోషంగా ఉండడమంటే ఏమిటో తనకు తెలుసు. అమ్మ సంతోషంగా ఉన్ననాడు మల్లెపూలు కొంటుంది. అవి తలలో పెట్టుకుంటుంది. తనను దగ్గరికి తీసుకుంటుంది. బెల్లం అడిగినా పెడుతుంది. నాన్నతో నవ్వుతూ మాట్లాడుతుంది.

ఇంతకీ ఈ పూట కాఫీ మాటేమిటి? ఎవ్వరూ కాఫీ సంగతి ఎత్తరే? నాన్న పక్కగదిలో బిగుసుకు కూచున్నాడు. ఎందుకో అమ్మ కూడా కాఫీ సంగతి ఎత్తడం లేదు. బాబు పొయ్యికేసి చూచాడు. పొయ్యి మీద అన్నం గిన్నె ఉన్నది. ఉదయం లేవడంతోనే బాబు మొహంకూడాకడుక్కున్నాడు. మరి కాఫీమాటేమిటి? కాఫీపొడిలేదని అమ్మ తనతో ఇంతకు ముందే చెప్పిపంపించిందికదూ నాన్నకి? అన్నం తినకపోయినా సరే, కాఫీ లేకపోతేమాత్రం తనకు ఎల్లాగో వుంటుంది. ఎలా

గైనా కాఫీ తాగాలనిపిస్తుంది. పోనీ అమ్మని కాఫీ అడిగితే? చక్కెర, కాఫీపొడి లేదంటుందేమో? కాఫీపొడి లేకపోతే అమ్మ కాఫీ ఎల్లా కాచియిస్తుంది? పోనీ పక్కింటి సుబ్బారావు గారి యింట్లో అడుక్కొస్తే? బాగానేవుంటుంది. కాని అమ్మ ఏమంటుందో?

నెమ్మదిగా బాబు తల్లి దగ్గరికివెళ్ళి "అమ్మా! సుబ్బారావుగారి యింట్లో కాఫీపొడి, చక్కెర బదులు అడుక్కురానా?" అని పక్కగదిలో తండ్రికి వినపడకుండా అన్నాడు.

"ఛీ, వెధవా! ఒకపూట కాఫీ లేకపోతే ప్రాణాలు ఎగిరిపోతాయా?" అని, తండ్రికి వినపడేటట్టు గట్టిగా అరిచింది తన తల్లి.

తండ్రి ఎక్కడ వినిపోతాడో అని భయమేసి, వెంటనే యింట్లోంచి అంతర్థానమైనాడు బాబు. సుబ్బారావుగారి యింట్లోకి వెళ్ళడానికి అట్టేకాలం పట్టలేదు బాబుకి. వాళ్ళు అప్పుడే కాఫీ తాగేసినట్లున్నారు. ఖాళీకప్పులు పడివున్నాయి, వంటయింట్లో—ఖాళీకప్పులు చూడడంతోనే బాబు మనస్సు చివుక్కుమంది. ఏమి చేయడమో తోచలేదు.

"కాఫీ తాగావుటరా?" అని అడిగింది వరలక్ష్మమ్మత్త తనని చూచీ చూడడంతోనే.

ఆ ప్రశ్నకి బాబు గతుక్కుమన్నాడు. తాగలేదంటే, డబ్బులేక కాఫీ తాగలేదని చెప్పాల్సివస్తుంది. కాగా మా యింట్లో కాఫీ కాచుకోలేదని చెబితే, అమ్మ ఏమంటుందో? "ఎందుకు చెప్పావురా వెధవా" అని అమ్మ కోప్పడితే?"

"ఇంతకు ముందే కాఫీ తాగా నత్తయ్యా" అని బొంకాడు బాబు విధిలేక. ఎందుకో చేదు మింగినట్లనిపించింది బాబుకి. మొహం వెలవెలపోయింది. వరలక్ష్మమ్మ పనితొందరలో ఆసంగతి గమనించలేదు. బాబు వంటయింట్లోనించి పక్కగదిలోకి వెళ్ళాడు. సుబ్బారావుగారు ఆ గదిలో లేరు. ఎక్కడికి వెళ్ళారని చూస్తే స్నానాలగది తలుపువేసివుంది. ఎంతోసేపటికిగాని స్నానాల గదిలోంచి వెలుపలికి రారు. వరలక్ష్మమ్మత్త వంటయింట్లో ఏదో పని చేసుకుంటున్నది. ఇప్పుడప్పుడే పక్కగదిలోకి రారు. పుస్తకాల్లో సుబ్బారావుగారు డబ్బుపెట్టడం లోగడ బాబు గమనించాడు. పుస్తకాల్లో డబ్బు వెతికి యింటికి తీసుకెడితే? బాగానే వుంటుంది. ఆ డబ్బుతో చక్కెర, కాఫీపొడి, బొగ్గులు, కూరగాయలు పనిమనిషితో తెప్పించుకోవచ్చు. ఉత్తరక్షణంలో కాఫీగ్లాసు పొగలు గ్రక్కడం బాబు మనోనేత్రానికి కనబడింది. ప్రాణం లేచి వచ్చింది.

వెంటనే బాబు పుస్తకాల దగ్గరికి వెళ్ళాడు. ఒక్కొక్క పుస్తకం చొప్పున బీరువాలోంచి పుస్తకాలు తీసి, డబ్బు కోసం వెతకడం మొదలెట్టాడు. తొందరలో ఒక పుస్తకం క్రింద పడింది. ఎవ్వరూ ఆ చప్పుడు విన్నట్లు కనపడలేదు. "ఏం, పడేశావురా?" అని ఎవ్వరూ కేక వెయ్యలేదు తనని – ఆగిన వాడల్లా తిరిగి పుస్తకాలు వెతకడం ప్రారంభించాడు బాబు. అమ్మయ్య, చివరకి ఒక పుస్తకంలో రెండు నోట్లు కనపడ్డాయి. అవి రూపాయల నోట్లో, అయిదు రూపాయల నోట్లో, లేక పదిరూపాయల నోట్లో బాబుకి అర్థం కాలేదు. యాంత్రికంగా ఆ నోట్లు నిక్కరుజేబులో దోపు

కున్నాడు. క్రిందపడిన పుస్తకం, తెరచిన బీరువా అల్లానే వుంచి, ఒకటే పరుగు తీశాడు తన యింటికి. బాబు మనస్సు కన్నా కాళ్ళు వేగంగా పరుగెత్తాయి. వంటయింట్లోకి వెళ్ళటంతోనే బ్రేకు పడ్డట్టు కాళ్ళు ఆగిపోయాయి.

"ఇదిగో డబ్బు — వెంటనే చక్కెర, బొగ్గులు, కాఫీ, కూరగాయలు తెప్పించు" అన్నాడు బాబు, ఆగీ ఆగడం తోనే, నిక్కర్ జేబులోంచి డబ్బుతీసి, తల్లికి అందిస్తూ.

రెండు పది రూపాయల నోట్లు బాబుచేతిలో చూడటం తోనే తల్లి నిర్ఘాంతపోయింది.

"ఎక్కడిదిరా డబ్బు" అని వెంటనే అడిగింది బాబుని.

"సంపాదించు కొచ్చాను — వెంటనే పని మనిషితో చక్కెర, కాఫీపొడి తెప్పించు" అన్నాడు బాబు.

"ముందు చెప్పు, డబ్బు ఎక్కడి నించి తెచ్చావో" అని అడిగింది తల్లి. బాబు మాట వినిపించుకోకుండా — చెప్పాను కదూ, సంపాదించు కొచ్చాననీ" అన్నాడు ధీమాగా.

"సంపాదించట మేమిటి నీ మొహం? ఎక్కడినుంచి తెచ్చావో చెప్పు?" అని ప్రక్క గదిలోంచి అప్పుడే వచ్చిన తండ్రి, బాబుని గద్దించాడు. తండ్రిని చూడటంతోనే బాబుకి భయంతో నోటమాట పెకల్లేదు. నిరుత్తరుడైనాడు.

"నంగనాచికి మల్లే ఉలక్కుండా, పలక్కుండా నిల బడుతా వెందుకు? చెబుతావా, చెప్పవా? ఎక్కడ నించి తెచ్చావో?" అని తండ్రి కోపంతో కళ్ళు పెద్దవి చేసి ఉరిమాడు.

బాబు ఈ సారి కూడా మాట్లాడలేదు.

బాబు మౌనానికి తండ్రికి మరీ కోప మొచ్చింది. ఒళ్లు తెలియని ఆవేశంలో బాబుని ఫెళ్ళున చెంప దెబ్బ పెట్టాడు. అయిదు వేళ్ళు చెంపకి అంటుకు పోయాయి.

బాబు గొల్లున ఏడుస్తూ "సుబ్బారావుగారి ఇంట్లో నించి తెచ్చాను" అన్నాడు.

"ఎల్లా తీసుకొచ్చావో, అల్లాగే వెళ్ళి ఇవ్వు" అని, ఇంకొకటి అంటించాడు తండ్రి, ఇంకొక చెంపమీద.

"వేలెడు లేడు అప్పుడే దొంగతనాలు ఆరంభించాడు వెధవ" అని తల్లి కోప్పడడం, సుబ్బారావుగారి ఇంటికి వెడుతున్న బాబుకి, దూరంగా వినపడింది.

వెక్కి వెక్కి ఏడుస్తూ, మంటకి బుగ్గలు ఒక చేత్తో నిమురుకుంటూ, వరలక్ష్మమ్మత్త దగ్గరికి వెళ్ళాడు బాబు.

"ఏం, బాబూ ఎందు కేడుస్తున్నావు?" అని అడిగింది బాబుని వరలక్ష్మమ్మ.

"మీ ఇంట్లో ఈ నోట్లు దొంగతనం చేశానట— నాన్న కొట్టాడు" అన్నాడు బాబు భోరున ఏడుస్తూ.

"ఎక్కడినుంచి తీశావు బాబూ ఆనోట్లు?" అనడిగింది వరలక్ష్మమ్మ.

"పుస్తకాల్లోంచి దొంగతనంచేశాను"అన్నాడు బాబు, ఊపిరి సలపకండా ఏడుస్తూ, "అప్పుడే దొంగతనాలు ఆరంభించాడన్న" తల్లి వాక్యం జ్ఞాపకం వచ్చి.

"ఎందుకు తీశావు బాబు?" అని అడిగింది వరలక్ష్మమ్మ ఎంతో అప్యాయంగా—

అనునయ వాక్యంతో బాబు దుఃఖం అమాంతంగా గట్లు తెగి ప్రవహించింది.

"ఇంట్లో చక్కెర లేదు. కాఫీ పొడి లేదు. బొగ్గులు లేవు. అందుకోసం దొంగతనం చేశా" నన్నాడు బాబు వెక్కి వెక్కి ఏడుస్తూనే—

"ప్రొద్దుటనుంచీ కాఫీ తాగలేదా?" అని అడుగుతూ, వరలక్ష్మమ్మ బాబుని దగ్గరికి తీసుకొని, కొంగుతో కళ్ళు తుడవడం మొదలు పెట్టింది.

"లేదత్తయ్యా!" అన్నాడు బాబు సిగ్గుతో ఆమె వొళ్ళో తల దాచుకుంటూ.

"మా నాన్నే, మా తండ్రే" అని వరలక్ష్మమ్మ బాబుని ఎత్తుకొని, గట్టిగా హృదయానికి హత్తుకుంది.

బాబు పిడికిలిలోంచి రెండు పదిరూపాయల నోట్లు క్రిందపడిపోయాయి ఆ ఆప్యాయతకి.

వెంటనే వరలక్ష్మమ్మ కాఫీ కాచింది.

బాబు కాఫీ తాగుతుంటే వరలక్ష్మమ్మ ముఖం సంతృప్తితో వికసించింది. ఆ దృశ్యాన్ని చూచిన సుబ్బారావుగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ సాయంత్రం సుబ్బారావుగారు ఆ యిరువై రూపాయలకి తోడు యింకొక యిరువై రూపాయలు వేసి, బాబుకి మూడు చక్రాల సైకిల్ కొనుక్కొచ్చాడు, ఉదయం వరలక్ష్మమ్మ, బాబు తల్లికి పది రూపాయలు బదులిచ్చిన సంగతి తెలిసికూడా. అది దారభ్యతా బాబుకీ తమ యింటికి వెళ్ళాలంటే ఎందుకో చాలా యిబ్బందిగా వుంటున్నది. ఎందుకో ఎక్కువకాలం సుబ్బారావుగారి యింట్లోనే గడుపుతున్నాడు బాబు.

✶